# మినీ కథ  సొద

## కె. సుజాతా భాస్కర్

"ఏమండీ!"

"ఊఁ!"

"మిమ్మల్నే!"

"ఊఁ"

"ఈనెల నాఖర్చు కిచ్చే డబ్బు ఇంకో ఐదు రూపాయలు ఎక్కువియ్యాలి."ఊఁ!"

"అమ్మో! ఐదే! వీల్లేదు. ఇంకో రెండు నెలలవరకు ఇంక్రిమెంట్లు లేవు!"

"అది నాకెరుకలేదు!"

"ఊఁ!"

"నా కస్సలు ఏ మీ ఇవ్వక్కరలేదు. అన్నీ మీరే చూసుకోండి!"

"ఊఁ!"

"నాకు అభిమానం ఉంది. రెండోసారి అడగనే అడగను."

"ఊఁ! నాకు నిద్దరొస్తోంది!"

...

...

"ఏమండీ!"

...

"మిమ్మల్నే!"

"అబ్బ! ఊఁ!"

"ఉత్త దద్దోజనం! ఎప్పుడూ నిద్దరే!"

"ఆయి! హన్నా! బయటున్నది నేనా?"

"ఛీ! మీకసలు సిగ్గులేదు!"

"ఊఁ!"

"కొంచెంకూడా సిగ్గులేదు!"

"ఊఁ!"

"నిజంగా సిగ్గులేదు!"

"ఊఁ!"

"ఎంత స్వార్థం మీది! కొంచెం కబుర్లు చెప్పకూడదా!"

"ఊఁ!"

"మాట్లాడండి మరి!"

"ఊఁ!"

"నేనింకోసారి అడగనే అడగను. నాకెన్ని ఖర్చులుంటాయి? అయినా అడగను"

"ఊఁ!"

"నాకు ఏమీ డబ్బులివ్వ నక్కరలేదు. మన పిల్లకి కావల్సినవి మాత్రం తెండి!"

"ఊఁ!"

"అన్నట్లు ఇవ్వాళ మన అమ్మాయి ఎంతల్లరి చేసిందో తెలుసా?!"

"ఊఁ!"

"ఒక్కత్తీ మేడమెట్లు ఎక్కేసింది, ఎంత ఆశ్చర్యం వేసిందో"

"ఊఁ!"

"అబ్బ మీకు ఎప్పుడూ నిద్దరే!"

"ఊఁ!"

"చంటి ముండ కదులుతున్నట్లుంది. కొంచెం ఉయ్యాల ఊపండి."

"ఊఁ!"

"ఒక రబ్బరుషీటు కొని పట్రండి!"

"ఊఁ!"

"విన్నారా! లేదా!? ఒక రబ్బరు షీటు కొనండి!"

"ఊఁ! నీకా? పిల్లదానికా?"

"ఛీ! మీకసలు సిగ్గులేదు!"

"ఊఁ!"

"మళ్ళీ సిగ్గులేదు!"

"ఊఁ!"

"అసలంటే అసలు సిగ్గులేదు!"

"ఊఁ!"

"ఇంకా ఎందుకు నిద్దరోతున్నారు? నేను ఎక్కువ డబ్బు అడగనన్నానుగా!"

"ఊఁ!"

"ఒక్క ఐదు రూపాయలకి ఇంతగొడవ చేస్తున్నారు. నేను మళ్ళీ అడగనే అడగను!"

"ఊఁ!"

"కొత్తచీర మీదకి జాకెట్టు కుట్టించాలి!"

"ఊఁ!"

"ఇంక మిమ్మల్ని అడక్కూడదని నిశ్చయించుకొన్నాను."

"ఊఁ!"

"నిజంగానే?"

"ఊఁ!"

"నమ్మరా?"

"ఊఁ!"

"అదిలేస్తే మిమ్మల్ని పడుకోనియ్యదు!"

"ఊఁ!"

"సరిగా ఇటుతిరిగి పడుకోండి. నేను రెండోసారి అడగనన్నానుగా!"

...

"ఎందుకు అడుగుతాను. నాకుమాత్రం అభిమానం లేదా!"

....

"ఏమిటి మళ్ళీ నిద్దరోతున్నారా? వినటం లేదా?"

"అబ్బ ఏమిటి?"

"నాకు డబ్బేమీ ఇవ్వక్కరలేదుగానీ ఒక సాయం చేసిపెట్టండి!"

"ఊఁ!"

"నాకు ఒక ఉద్యోగం ఇప్పించండి. ఒక వంద రూపాయలు వచ్చినా చాలు."

"ఊఁ!"

"మీరు అప్పుడు నాకు ఏమి ఇవ్వక్కరలేదు."

"ఊఁ!"

"పిల్లరాక్షసి రోజు మంచం అంతా తడిపేస్తోంది. పరుపులు తగలడుతున్నాయి."

"ఊఁ!"

"పోన్లెండి! నా మాట విలువ మీరే తెలుసుకుంటారు!"

"ఊఁ!"

"వింటున్నారా?"

"ఊఁ!"

"మిమ్మల్నే!"

"అబ్బ! నాకు వద్దనేవద్దు! మీరు మరీ బలవంతంచేస్తే తీసుకుంటాను గానీ!"

"ఊఁ!"

"ఏమండీ?"

"ఊఁ!"

---

### ఫర్ యువర్. ఇన్ఫర్ మేషన్

#### మీకు తెలిస్తే చెప్పుకోండి

1. మొట్టమొదటి టెస్ట్ ట్యూబ్ బేబి పేరు?
2. మొట్టమొదటిసారిగ స్టీలుతో పెన్నులు తయారుచేసిన దేశం ఏది?
3. నీళ్ళమీద నడిచే పక్షి ఏది?
4. రెక్కలకి వేలువున్న పక్షి ఏది?
5. ఎన్నో శతాబ్దంలో సువాసన గల సబ్బులు తయారు చేశారు?
6. సముద్రంలో ప్రవహించే మంచు ద్వీపాన్ని ఏమంటారు?
7. మొట్టమొదటిసారి క్షయవ్యాధికి మందు (టీకా)ను కనిపెట్టిన జంట శాస్త్రవేత్తలు ఎవరు?

పంపినవారు :

-కె. హరినాథరెడ్డి వేములగోడు)

సమాధానాలకోసం
30వ పేజీ చూడండి